



రంజాన్ వేళలు
ఇఫ్తార్ - బుధవారం
సాయంత్రం - 6.32
సహర్ - గురువారం
ఉదయం - 4.58

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థుల విషయంలో ఇప్పటి వరకు అధికార పార్టీ మల్లగుల్లాలు పడుతోంది. ఇక్కడ బలమైన అభ్యర్థులను ఎవరిని బరిలో దింపాలా అన్న మీమాంసలో ఉంది. అయితే, చివరకు ఈ ఉత్కంఠ వీడినట్టే ఉంది. బీఆర్ఎస్ పార్టీ నుంచి వచ్చిన చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డిని చేవెళ్ల నుంచి పోటీకి నిలపాలని, మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతా మహేందర్‌రెడ్డిని రంగంలోకి దించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్టు సమాచారం. వీరి అభ్యర్థిత్వాలను పార్టీ అధికారికంగా ప్రకటించనప్పటికీ పోటీలో వీరే ఉండవచ్చని చర్చ సాగుతోంది. ఈ రెండు స్థానాల విషయంలో పార్టీ అధిష్టానం చేసిన కసరత్తు కొలిక్కి వచ్చినట్టుగా ప్రచారం సాగుతోంది.

కొలిక్కి వచ్చిన పంచాయితీ!


» చేవెళ్ల అభ్యర్థిగా రంజిత్‌రెడ్డి!
» మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పట్నం సునీతా మహేందర్‌రెడ్డి!
» మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి ఆఫర్!

చేవెళ్ల, మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థులు దాదాపు ఖరారు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

కాంగ్రెస్‌లో టికెట్ల పంచాయితీ దాదాపు కొలిక్కివచ్చింది. కొద్ది రోజులుగా చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ టికెట్ల విషయంలో పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. చేవెళ్ల సీటును సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. అలాగే ఈ టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి మల్కాజిగిరి టికెట్ ఖరారు చేసినట్లు సమాచారం. మల్కాజిగిరి నుంచి పోటీకి సునీతారెడ్డి నిరాకరించడంతో కొద్ది రోజులుగా దీనిపై స్తబ్దత నెలకొంది. మహేందర్‌రెడ్డి కుటుంబసభ్యులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి వారిని బుజ్జగించడంతో వారు వెనక్కి తగ్గారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం జరిగే రాష్ట్ర క్యాబినెట్ విస్తరణలో మహేందర్‌రెడ్డికి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మహేందర్‌రెడ్డి వెనక్కి తగ్గి సునీతారెడ్డిని మల్కాజిగిరి నుంచి బరిలో దింపేందుకు అంగీకరించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. వాస్తవానికి చేవెళ్ల, మల్కాజిగిరి పార్లమెంట్ స్థానాల నుంచి పోటీ చేసేందుకు కొందరు పార్టీ సీనియర్లు ఆసక్తి చూపినప్పటికీ ఆకస్మాత్తుగా బీఆర్ఎస్ నుంచి వచ్చిన వారికి టికెట్లు ఇవ్వాలని పార్టీ నాయకత్వం నిర్ణయించింది. అయితే ఇలా ఎన్నికల తరువాత బీఆర్ఎస్‌లో చేరిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డి, సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డికి మధ్య చేవెళ్ల టికెట్ విషయంలో రగడ మొదలైంది. నిజానికి చేవెళ్ల ఎంపీ టికెట్ ఇస్తామనే హామీతోనే మహేందర్‌రెడ్డి కుటుంబం కాంగ్రెస్‌లో చేరింది.





ఆమెను ప్రచారం కూడా చేసుకోవాలని సూచించడంతో ఆమె చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో ప్రచారం మొదలు పెట్టారు. అనేక సభలు, సమావేశాలు నిర్వహించారు. అయితే అనూహ్యంగా బీఆర్ఎస్ ఎంపీ రంజిత్‌రెడ్డిని కూడా కాంగ్రెస్‌లో చేర్చుకున్నారు. దీంతో చేవెళ్ల టికెట్‌పై గందరగోళం మొదలైంది. సునీతారెడ్డిని మల్కాజిగిరి నుంచి పోటీ చేయాలని పార్టీ సూచించింది. దీంతో మహేందర్‌రెడ్డి కుటుంబీకులు షాక్ తిన్నారు. సునీతారెడ్డి తాను చేవెళ్ల నుంచే పోటీ చేస్తానని.. మల్కాజిగిరి వెళ్లేది లేదని స్పష్టం చేశారు. దీంతో మహేందర్ రెడ్డి, ఆయన సతీమణి సునీతారెడ్డిలతో సీఎం మాట్లాడి వారిని బుజ్జగించారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత మంత్రి పదవి ఇస్తామని మహేందర్‌రెడ్డికి ఆఫర్ ఇచ్చినట్లు తెలిసింది. దీంతో మల్కాజిగిరి నియోజకవర్గం నుంచి పోటీకి వారు అంగీకరించారు. ఇదిలా ఉంటే త్వరలో బీఆర్ఎస్ నుంచి భారీగా చేరికలు ఉంటాయని చెబుతున్నారు. నగర శివార్లలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

తొలి నుంచి తప్పటడుగులు

పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైనప్పటికీ అధికార కాంగ్రెస్ పార్టీలో మాత్రం కొంత గందరగోళ పరిస్థితులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేయగా అధికార కాంగ్రెస్ మాత్రం ఇంకా అధికారికంగా అభ్యర్థులను నిర్ణయించలేదు. గతంలో బరిలో ఉంటారనుకున్న వారి స్థానంలో కొత్త పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జ్‌గా ఉన్న చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో రోజుకో పరిణామం జరగడం విశేషం. అలాగే సీఎం రేవంత్ రెడ్డి నిన్నమొన్నటి వరకు ప్రాతినిధ్యం వహించిన మల్కాజిగిరి నియోజకవర్గంపై పార్టీకి స్పష్టత లేకపోవడం గమనార్హం. చేవెళ్ల నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆసక్తి కనపరిచారు. ఉమ్మడి జిల్లాలో పలుకుబడిన రాజకీయ నేతల్లో ఆయన ఒకరు. అలాగే ఆయనతో పాటు మరికొందరు సీనియర్లు కూడా చేవెళ్ల టికెట్ ఆశించారు. కానీ పార్టీ అధినాయకత్వం బయట నుంచి వలస వచ్చిన వారికే ప్రాధాన్యత ఇచ్చింది. వారికి టికెట్ విషయంలో కూడా అధికార పార్టీ గందరగోళంగానే వ్యవహరిస్తోంది. చేవెళ్ల నుంచి బరిలో దిగాలని భావించిన మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డికి పార్టీ నాయకత్వం చివరి క్షణంలో షాక్ ఇచ్చింది. ఆమె స్థానంలో సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి పేరు తెరపైకి తీసుకువచ్చింది. వీరికి టికెట్ ఇచ్చే విషయంలో కూడా చివరి వరకు గందరగోళమే నెలకొంది. రాష్ట్రంలో కీలకమైన చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పోటీ విషయంలో అధికార పార్టీ అనుసరిస్తున్న వైఖరి కాంగ్రెస్ నేతలతో పాటు సాధారణ కాంగ్రెస్ కార్యకర్తలకు అంతుపట్టడం లేదు. ఈ రెండు సీట్లపై కన్నేసిన బీజేపీ ఇప్పటికే ఇక్కడ బలమైన అభ్యర్థులను బరిలో దింపింది. వీరు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఉమ్మడి జిల్లాలోని ఈ రెండు స్థానాల అభ్యర్థుల ఎంపిక విషయంలో సామాజిక సమతుల్యతను పాటించాయి. కానీ అధికార పార్టీ మాత్రం ఈ రెండు సీట్లు ఒకే సామాజిక వర్గానికి కేటాయించాలని నిర్ణయించింది. ఇదిలా ఉంటే చేరికల విషయంలో కూడా పార్టీ అధినాయకత్వం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ శ్రేణులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్‌లో చేరుతున్న సమయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు, ఎమ్మెల్యేలకు సరైన సమాచారం లేదని తెలుస్తోంది. ఉదాహరణకు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరే సమయంలో పార్లమెంట్ పరిధిలోని ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యే కానీ, జిల్లా పార్టీ అధ్యక్షుడు కానీ, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు కానీ లేకపోవడాన్ని పార్టీ సీనియర్లు తప్పుబడుతున్నారు. అలాగే నగర శివార్లలోని బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తిగా ఉన్నప్పటికీ ఇపుడేమీ తొందర లేదన్నట్లుగా నిన్నమొన్నటి వరకు కాంగ్రెస్ వ్యవహరిస్తూ వచ్చింది. అయితే ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో చేరికలపై స్పీడ్ పెంచింది. ఎన్నికల సమయంలో పార్టీ అధినాయకత్వం చేస్తున్న తప్పిదాలు ఫలితాలపై ప్రభావం చూపే అవకాశాలు కూడా లేకపోలేదు.



ఆమనగల్లులో రథాన్ని లాగుతున్న భక్తులు

కనుల పండువగా రథోత్సవం

● వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు
● పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున స్వామి పెద్ద రథోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి యువత, భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు తరలివచ్చారు. రథాన్ని శోభాయమానంగా అలంకరించి రథంపై స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి భక్తి శ్రద్ధలతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, అర్చకులు గూడ క్రిష్ణమాచార్యులు, స్థానిక నాయకులు బికుమండ్ల నర్సింహ, దోనాదుల కుమార్, మామిడిశెట్టి రవి, సైదులుగౌడ్, సురేష్‌నాయక్, శ్రీశైలం, పద్మ ప్రశాంత్, సాయికుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు, మార్చి 19

విధుల పట్ల అలసత్వం వహిస్తే.. చర్యలు తప్పవు

» జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 19 : ఎన్నికల నిర్వహణలో విధుల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శశాంక హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్నికల సెక్టోరల్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, పరిశీలించాల్సిన విషయాలపై అంశాలవారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలకు లోబడి నిర్వర్తించాల్సిన విధుల గురించి తెలియజేస్తూ రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని తెలిపారు. ఏ చిన్న అనుమానానికీ తావు లేకుండా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలన్నారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని వెను వెంటనే ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ పరిధిలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నిర్ణీత గడువులోపు పూర్తి వివరాలతో ప్రాథమిక నివేదికను సహాయ రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన తర్వాత మూడు రోజుల్లోపు తుది నివేదికను అందించాల్సి ఉంటుందన్నారు. ప్రధానంగా ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా నిలువరించే వారిని, అలాగే ఓటర్లను ప్రభావితం చేసే వారిపై నిఘా పెట్టి ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని కలెక్టర్ శశాంక సూచించారు. శిక్షణ తరగతుల్లో జిల్లా ఉప ఎన్నికల అధికారి ప్రతిమాసింగ్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి సంగీత, సౌమ్య, సురేష్ మోహన్ పాల్గొన్నారు.

రూ.50 వేలకు మించి లావాదేవీలు జరిగితే రసీదులు తప్పనిసరి

రూ. 50 వేల నుంచి రూ. 10 లక్షల మధ్య లావాదేవీలు జరిగితే కచ్చితంగా రసీదు ఉండాలని కలెక్టర్ శశాంక పేర్కొన్నారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకుని స్టాటిక్ సర్వైలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర నిఘా బృందాల అధికారులకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయా పార్టీలు, అభ్యర్థుల ప్రచార సరళి పరిశీలన, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే అంశాలు, నిరోధించడం, ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం, నిరంతర తనిఖీల నిర్వహణ తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. జిల్లాలో మూడు టీములు ఏర్పాటు చేసి ప్రతి టీమ్ ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించే విధంగా డ్యూటీలు కేటాయించినట్టు తెలిపారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే విధంగా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై స్పందించి క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా వాస్తవాలను నిర్ధారించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిఘా బృందాల దృష్టిని మళ్లించేందుకు పలువురు చేసే తప్పుడు ఫిర్యాదుల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎన్నికల వ్యయం, ప్రచార సరళిపై నిఘా బృందాలు అనునిత్యం నిఘా ఉంచాలని తెలిపారు. స్టాటిక్ సర్వైలెన్స్ ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర బృందాల వాహనాలకు అత్యాధునిక సాంకేతికతతో కూడిన పీటీజీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.

ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు

ఇంటింటి సర్వే నిర్వహించి 85 సంవత్సరాలు పైబడిన వారిని గుర్తించి వివరాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ శశాంక తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం నోడల్ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 85 సంవత్సరాల పైబడిన వృద్ధులు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుండి ఓటు వేసే వెసులుబాటు కల్పించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన ఐదు రోజుల లోపు అంటే ఏప్రిల్ 22వ తేదీ లోపు ఫారం 12-డి భర్తీ చేసి బీఎల్వోలకు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి శ్రీలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శ్రీలత, నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీరు అవసరమయ్యే సాగువైపు రైతుల మొగ్గు

» భానుడి తీవ్రతకు ఎండుతున్న చెరువులు, కుంటలు
» గణనీయంగా పడిపోయిన భూగర్భ జలాలు
» ఆగి ఆగి పోస్తున్న బోర్లు
» డ్రిప్, మల్చింగ్ పద్ధతిలో సాగుతో ఊరట



యాచారంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఆకుకూరలు



అయ్యవారిగూడలో మల్చింగ్, డ్రిప్‌తో సాగు చేస్తున్న వంకాయ, పచ్చిమిర్చి తోటలు

కూరగాయ పంటలతో ఖుషీ

యాచారం, మార్చి 19 : ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురవకపోవడంతో భూగర్భజల మట్టాలు గణనీయంగా పడిపోయాయి. రెండేళ్లుగా చెరువులు, కుంటలు పూర్తిగా నిండకపోవడంతో నీటి కొరత ఏర్పడింది. వరి పంటలు చేతికందుతాయా? లేదా? అని రైతులు తల్లడిల్లుతున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో 116 చెరువులు, కుంటలున్నాయి. దాదాపు అవన్నీ ఎండిపోయే స్థితికొచ్చాయి. చాలావరకు వ్యవసాయ బోర్లు ఆగి ఆగి నీరు పోస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు తక్కువ నీరు అవసరమయ్యే ఆకుకూరలు, కూరగాయ తోటలు సాగు చేయడం ఉత్తమమని భావించారు. దాదాపు 413 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేశారు. భూగర్భజలం పడిపోవడంతో వరి పంటలపై ఆశలు వదులుకొని ఆరుతడి పంటలను డ్రిప్, మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్నారు. టమాట, వంకాయ, మిర్చి, సొరకాయ, బీరకాయ, కాకర, పొట్ల, బెండ, శ్యామగడ్డ, ఉల్లిగడ్డ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, పుదీన, పాలకూర, కొత్తిమీర, తోటకూర, చిక్కుడు, పచ్చిమిర్చి తదితర పంటలు సాగు చేశారు. కాగా, ప్రభుత్వం ఎలాంటి రాయితీ ఇవ్వకపోయినా డ్రిప్, మల్చింగ్‌కు సంబంధించిన పరికరాలతో సాగు చేస్తూ నీటిని పొదుపుగా వాడుతున్నారు. గడ్డమల్లాయగూడ, చౌదర్‌పల్లి, అయ్యవారిగూడ, ధర్మన్నగూడ, మొండిగౌరెల్లి, నందివనపర్తి, నల్లవెల్లి, గున్‌గల్, కుర్మిద్ద, యాచారం, మేడిపల్లి తదితర గ్రామాల్లో ఆకుకూరలు, కూరగాయల సాగు అధికంగా చేస్తున్నారు. నగరంలోని కొత్తపేట రైతుబజార్, ఎల్బీనగర్, మాదన్నపేట, మోండా మార్కెట్‌లకు కూరగాయలు తరలిస్తున్నారు. ఎకరం భూమిలో వంకాయ, పచ్చిమిర్చి తోటల సాగుకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టగా.. డ్రిప్, మల్చింగ్‌కు రూ.50వేల వ్యయం చేసినట్లు అయ్యవారిగూడకు చెందిన రైతు లింగం తెలిపారు. ధర్మన్నగూడలో కొందరు రైతులు అరెకరం పొలంలో టమాట సాగు చేసి రూ.లక్ష వరకు లాభం గడించినట్లు తెలిపారు. టమాట సాగుతో ఈ ఏడాది మంచి లాభాలు వచ్చాయని రైతులు తెలిపారు. పంట మార్పిడి ఎంతగానో ఉపయోగపడిందని చెబుతున్నారు.

కూరగాయలు, ఆకు కూరలతో లాభాలు



టమాట, సొరకాయ, వంకాయ బెండ తోటలు వేశాం. నీటి కొరత వల్ల డ్రిప్, మల్చింగ్ పద్ధతుల్లో సాగు చేస్తున్నాం. చెరువులు, కుంటలు నిండకపోవడంతో బోర్లు ఆగి ఆగి పోస్తున్నాయి. నీటి కొరత తీవ్రంగా ఉంది. కొత్తపేటలోని రైతుబజార్‌కు తీసుకెళ్లి విక్రయిస్తున్నాం.

- బొడ్డు ఐలమ్మ, మహిళా రైతు, గడ్డమల్లాయగూడ

అరెకరం సాగుతో రూ.లక్ష లాభం



డ్రిప్ సాయంతో అరెకరంలో టమాట సాగు చేసి రూ.లక్ష లాభం గడించాను. బోరు ఆగి ఆగి పోస్తుండటంతో డ్రిప్ సాయంతో సాగు చేశాను. పశువుల ఎరువు మాత్రమే వాడాము. ఎలాంటి రసాయన మందులూ వాడలేదు. శ్రీవరి సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తే బాగుంటుంది.

- రఘుపతి, రైతు, ధర్మన్నగూడ



యాచారంలో సాగవుతున్న టమాట తోట

తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో తనిఖీ



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీవో వసు చంద్ర

వికారాబాద్, మార్చి 19: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో వసు చంద్ర మంగళవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌తో మాట్లాడారు. అనంతరం పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. అక్కడ జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

ఏప్రిల్ 2 నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయం

కొడంగల్, మార్చి 19: పేదల తిరుపతిగా పేరొందిన కొడంగల్ శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ ధర్మకర్తలు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేస్తున్నారు. ఏటా బ్రహ్మోత్సవాలను తిరుపతి మాదిరిగానే అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, తితిదే తరఫున శేష వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 3న సేనాధిపతి ఉత్సవం, అంకురార్పన, 4న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్దశేష వాహనం, 5న చిన్న శేష వాహనం, హంస వాహనం, 6న సింహ వాహనం నిర్వహించనున్నారు. వ్యాళి వాహనం, 7న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, 8న మోహిని అవతార ఉత్సవం, అమావాస్య పూలంగిసేవ, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి నుంచి శేష వస్త్రాల సమర్పణ చేయనున్నారు. అదేవిధంగా 9న హనుమంత వాహనం, వసంతోత్సవం, ఉగాది ఆస్థానం, గజ వాహనం, 10న సూర్య ప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 11న రథోత్సవం, అశ్వ వాహనం నిర్వహించనున్నారు. 12న పల్లకీ సేవ, చక్రస్నానం, ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతీ రోజు మధ్యాహ్నం 3 గంటలకు స్వామివారికి అభిషేకం, సాయంత్రం 7గంటలకు ఊంజల్ సేవ, శ్రీ బాలాజీ పాడుతా తీయగా కార్యక్రమం, రాత్రి 9 గంటల నుంచి 11గంటల వరకు భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తోలు వెంకటయ్య

బొంరాస్‌పేట్, మార్చి 19: మండలంలోని తుంకిమెట్ల గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు తోలు వెంకటయ్య కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో తోలు వెంకటయ్యతో పాటు మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ వెంకటయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో మండల, నియోజకవర్గంలోని ఎస్సీ కుటుంబాలకు సేవలందిస్తానని తెలిపారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఈద్గా కమిటీ

రంజాన్ పండుగ ఏర్పాట్ల పరిశీలన

తాండూరు: మార్చి 19: తాండూరు మున్సిపల్ పరిధిలోని చెంగేష్‌పూర్ రోడ్డులో గల ఈద్గాను మంగళవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి స్థానిక ముస్లింలతో కలిసి పరిశీలించారు. సమస్యలపై ఈద్గా కమిటీ అందజేసిన వినతిపత్రాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.



విచారణ జరుపుతున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చీలాపూర్‌లో డీఎల్‌పీవో విచారణ

పూడూరు, మార్చి 19: చీలాపూర్ పంచాయతీ కార్యదర్శి ఇళ్ల నిర్మాణ అనుమతులకు మామూళ్లు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై ఈనెల 3వ తేదీన 'ఇళ్ల అనుమతులకు మామూళ్ల వసూలు' శీర్షికతో ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో సంధ్యారాణి మంగళవారం చీలాపూర్‌లో పంచాయతీ కార్యదర్శిపై విచారణ జరిపారు. ఇట్టి విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుందర్, ప్రత్యేకాధికారి తులసిరామ్, చీలాపూర్ ఇన్‌చార్జి మాణిక్యం పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

పరిగి, మార్చి 19: పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం గణపతిపూజ, విశ్వక్సేనపూజ, పుణ్యావచనం, స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణం, పంచగ్యపాశణ, గోపుపూజ, మృత్యుగ్రహణం, అంకురార్పణం, దీక్షాధారణం, రుత్సాంగవణం, సాయంత్రం తులసి అర్చన, కుంకుమ అర్చన, సాయంత్రం ఎదురుకోళ్ల కార్యక్రమాలు నిర్వహించారు. 54 యజ్ఞగుండంలతో సుదర్శన యాగంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన దంపతులు కూర్చున్నారు. ఈఉత్సవాల్లో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి దంపతులు కూర్చొని ప్రత్యేకపూజలు చేశారు. పండితులు వారికి స్వాగతం పలికారు. స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్మన్ ఎం.అశోక్, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, కె.కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇ.కృష్ణ, ఆయా పార్టీల నాయకులు కె.రఘుమోహన్‌రెడ్డి, ఎస్పీ బాబయ్య, కె.హన్మంత్‌ముదిరాజ్, బి.ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉత్సవాల పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు

కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష

- మహేశ్వరంలో బీఆర్‌ఎస్‌కు భారీ గండి
- రోజురోజుకూ పెరుగుతున్న ముఖ్యనేతల రాజీనామాలు
- కాంగ్రెస్ బలోపేతానికి వరుస సమావేశాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు తీగల, కేఎల్లార్, జడ్పీచైర్ పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి

మహేశ్వరం, మార్చి 19 : మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్‌లో చీలికలు, అధికార కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్నాయి. మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి ఆయన కోడలు మహేశ్వరం జడ్పీటీసీగా ఉన్న రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు ఇప్పటికే అధికార కాంగ్రెస్‌లో చేరి వారి అనుచరులను పార్టీలో చేర్చుకోవడంలో బిజీబిజీగా గడుపుతున్నారు. తాజాగా చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా చేరడంతో నియోజకవర్గంలోని మరికొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమౌతున్నారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ ఆర్. సునిత అంద్యానాయక్ దంపతులు, తుమ్మలూరు మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు రాఘువేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు వి.యాదగిరిలు అనుచరులతో రెండు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే మహేశ్వరం మాజీ సర్పంచ్ కూన యాదయ్య, మన్‌సాన్‌పల్లి ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ మర్యాద మురళీధర్‌రెడ్డితో పాటు మాజీ సర్పంచ్‌లు, ఉపసర్పంచులు, బీఆర్‌ఎస్ మండల స్థాయి నాయకులు, తుక్కుగూడ మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు పద్మలతో పాటు నియోజకవర్గంలోని తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీలు, మీర్‌పేట, బడంగ్‌పేట కార్పొరేషన్లకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరారు. మహేశ్వరం, కందుకూరు మండలాలకు చెందిన కొందరు మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, మాజీ ఉపసర్పంచులతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ కార్యకర్తలు కూడా కాంగ్రెస్‌లో చేరబోతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. కేఎల్లార్ కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్‌ఎస్‌ను నియోజకవర్గంలో కనుమరుగు చేయాలనే ఉద్దేశంతోనే బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరేందుకు చాపకింద నీరులా పావులు కదుపుతున్నారు. ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాత్రం ఇదంతా జరుగుతున్నా మౌనంగా ఉండడంతో నియోజకవర్గం బీఆర్‌ఎస్ వర్గాల్లో తీవ్ర దుమారాన్నే లేపుతోంది.



మాట్లాడుతున్న తీగల కృష్ణారెడ్డి, అనితాహరినాథ్‌రెడ్డి

మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయాలి

మాజీ ఎమ్మెల్యే తీగల, జడ్పీ చైర్‌పర్సన్ అనిత

మహేశ్వరం, మార్చి 19 : మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేయడమే లక్ష్యంగా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ అనితాహరినాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నియోజకవర్గం పరిధిలోని మీర్‌పేటలో గల తీగల క్యాంపు కార్యాలయంలో మహేశ్వరం, కందుకూరు మండలాల ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కష్టపడే కార్యకర్తలను కాంగ్రెస్ కంటికి రెప్పలా కాపాడుకుంటుందన్నారు. త్వరలో అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలు వేసి ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి చేరవేయడంలో ముందుండేలా చర్యలు తీసుకుందామన్నారు. ఎం.కరుణాకర్‌రెడ్డి, యాదగిరి, జైపాల్‌రెడ్డి, జగన్, మర్యాద రాఘువేందర్‌రెడ్డి, సదానంద్‌గౌడ్, పాండు, హన్మంత్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కారు దిగి కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్లు

- అదే బాటలో ఎంపీపీ.. చర్చలు పూర్తి!

షాద్‌నగర్ అర్బన్, మార్చి 19: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని కౌన్సిలర్లు కొందరు కారు దిగి కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిలు చర్చలు జరుతున్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జీవన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డిల గెలుపే లక్ష్యంగా కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ ముఖ్యనాయకులు కాంగ్రెస్‌లో చేరడానికి ప్రోత్సహిస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే ఇద్దరు జడ్పీటీసీలు, ఒక ఎంపీపీ, పలువురు సర్పంచ్‌లను చేర్చుకున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ నాయకులను టార్గెట్ చేస్తున్నారు. కొందరు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, తాజా మాజీ సర్పంచ్‌లు సైతం అధికార పార్టీలో చేరడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఎమ్మెల్యే పిలిచినప్పుడే కాంగ్రెస్‌లోకి వెళ్లితే ప్రాధాన్యత ఉంటుందని భావిస్తూ, పార్టీలో చేరడానికి ఆసక్తిని చూపుతున్నారు. ఇటీవలనే షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొందరు ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా ఫరూఖ్‌నగర్ ఎంపీపీ ఖాజా ఇద్రీష్ అహ్మద్, షాద్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ అగ్గనూరి విశ్వం, కౌన్సిలర్లు విశాల, లతశ్రీలతో పాటు మరికొందరు కౌన్సిలర్లలో చర్చలు జరిపినట్లు సమాచారం. వారు బుధవారం ఎమ్మెల్యే వీర్లపల్లి, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరబోతున్నారని సమాచారం. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని 28 మంది కౌన్సిలర్లలో ఇద్దరు మాత్రమే కాంగ్రెస్‌లో ఉన్నారు. మరో ఇద్దరు చేరబోతున్నారు. మరి కొంతమందిని చేర్చుకోవడానికి చర్చలు జరుగుతున్నట్లు సమాచారం.

అట్టహాసంగా బండలాగుడు పోటీలు

కేశంపేట, మార్చి 19: మండల పరిధిలోని బైర్కాన్‌పల్లిలో లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం అంతర్రాష్ట్ర బండలాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. పోటీలను కేశంపేట జడ్పీటీసీ తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి ప్రారంభించారు. నాగర్‌కర్నూల్, గద్వాల జోగులాంబ, వనపర్తి జిల్లాకు చెందిన ఎడ్ల జతలతో పోటీదారులు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి నాగర్‌కర్నూల్ జిల్లా జోజిరెడ్డి ఎద్దుల జత పొందింది. ప్రథమ బహుమతిని దాత కొట్టం శశివర్ధన్‌రెడ్డి రూ.60వేలు నగదు అందించారు. రెండో బహుమతి గద్వాల బోగులాంబ జిల్లా హరి ఎద్దుల జత గెలుచుకుంది. బహుమతిని దాత మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వై.యాదయ్య యాదవ్ రూ.50వేలు, మూడో బహుమతి వనపర్తి జిల్లా, పెద్దదగడకు చెందిన గోపాలకృష్ణ ఎద్దుల జత గెలుచుకుంది. జడ్పీటీసీ రూ.30వేలు అందించారు. గద్వాల జోగులాంబ జిల్లా అయిజకు చెందిన భాస్కర్ గౌడ్ ఎద్దుల జత నాలుగో బహుమతి పొందింది. రూ. 20వేలు యెన్నం గోపాల్ రెడ్డి అందించారు. పోటీలను తిలకించడానికి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. మాజీ సర్పంచ్‌లు రూప్లానాయక్, కృష్ణయ్య, రాఘువేందర్‌రావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికలకు క్యాంపు రాజకీయాలు

- సౌత్‌ఇండియా టూర్‌కు వెళ్లనున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు!
- సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ గెలుపు కోసం నాయకుల పట్టు
- తమదే గెలుపంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

షాద్‌నగర్/కొత్తూర్, మార్చి 19 : మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సత్తా చాటాలనుకున్న కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులకు గాలం వేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని దెబ్బతీయాలనే ఉద్దేశ్యంతో బీఆర్‌ఎస్ అధిష్టానం సూచన మేరకు స్థానిక నాయకులు.. ఆ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులను, వారి కుటుంసభ్యులతో కలిపి క్యాంపులకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఓటర్లను సౌత్‌ఇండియా టూర్‌కు తరలించేందుకు బీఆర్‌ఎస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. ప్రధాన దేవాలయాలతో పాటు, ఊటీ, కొడయ్‌కెనాల్, గోవా ప్రాంతాలకు విహారయాత్రకు తరలివెళుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ పరిధిలోకి రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని 6మండలాలు, 2మున్సిపాలిటీలు, కల్వకుర్తి నియోజకవర్గంలోని 4మండలాలు, ఒక మున్సిపాలిటీ వస్తుంది. ఇందులో మొత్తం 171మంది ఓటర్లు ఉన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గంలో ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరి కొంతమంది బీఆర్‌ఎస్ ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ కావడంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపును సవాలుగా తీసుకుని బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులకు గాలం వేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో ఆ పార్టీ ముఖ్యనేతలు బీఆర్‌ఎస్‌కు చెందిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లను తమ పార్టీలో కలుపుకునేందుకు సులవుగా ముందుకు సాగుతుండగా, మరోవైపు బీఆర్‌ఎస్ నాయకులు మాత్రం తమ ప్రజాప్రతినిధులు కాపాడుకునేందుకు క్యాంపులకు తరలించేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. క్యాంపులకు తరలిస్తే ప్రజాప్రతినిధులు చేజారి పోకుండా ఉంటారనే ఉద్దేశ్యంతో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. వారం రోజులపాటు క్యాంపులకు వెళ్లి ఈనెల 28న జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక రోజు తిరిగి వస్తారని విశ్వసనీయ సమాచారం. కొందరు బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు క్యాంపులకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నా.. మరి కొందరు ప్రజాప్రతినిధులు క్యాంపులకు వెళ్లేందుకు సిద్ధమైనట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ పరిధిలో 1,439 మంది ఓటర్లు ఉండగా, 9 వందలకు పైగా బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్సీ చేజారిపోకుండా బీఆర్‌ఎస్ నాయకులు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. క్యాంపులకు తరలిస్తే తమదే విజయమని ఆ పార్టీ నాయకులు ధీమాగా ఉండగా, కాంగ్రెస్ నాయకులు మాత్రం తాము ఖచ్చితంగా విజయం సాధిస్తామని బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఏది ఏమైనప్పటికీ ఎన్నికల్లో ఎవరి వ్యూహం ఫలిస్తుందో వేచి చూడాల్సిందే.



పెద్దఎల్కిచర్ల ఎంపీటీసీ మంగమ్మకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

పోలీస్ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్‌కు తుది వీడ్కోలు

బషీరాబాద్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు సోమవారం రాత్రి పోలీస్ లాంఛనాలతో నిర్వహించారు. బషీరాబాద్ మండలం అల్లాపూర్ గ్రామానికి చెందిన కృష్ణకుమార్ (ఏఆర్ కానిస్టేబుల్)ఈ నెల 18న ఓ శుభకార్యానికి వెళ్లి వస్తూ వికారాబాద్ మండలం పులుసుమామిడి గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ లాంఛనాలతో గార్డ్‌ఆఫ్ హానర్‌తో తుది వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో తాండూర్ రూరల్ సీఐ అశోక్, ఆర్ఐ డేవిడ్ విజయ్, ఎస్ఐలు రమేష్, పోలీసు సిబ్బంది పలు వురు పాల్గొన్నారు.



అల్లాపూర్‌లో పోలీస్ లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం



ఎర్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సినీ నటుడు సుమన్

పర్యావరణ పరిరక్షణ.. సామాజిక బాధ్యత

కడ్తాల్, మార్చి 19: పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రముఖ సినీనటుడు సుమన్ అన్నారు. మండలంలోని అన్మాస్‌పల్లి సమీపంలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ది ఎర్త్ సెంటర్‌ను మంగళవారం సుమన్ సందర్శించారు. సంస్థ చైర్మన్ లీలా లక్ష్మారెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం వారు ది ఎర్త్ సెంటర్‌ను పరిశీలించి.. పర్యావరణ పరిరక్షణకు చేపడుతున్న కార్యక్రమాలపై ఆనందం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ శంకర్, సంస్థ నిర్వాహకులు లక్ష్మారెడ్డి, రజనీకాంత్, కోటేశ్, వెంకటేశ్, ఉమామహేశ్వర్‌రెడ్డి, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

బొంరాస్‌పేట్, మార్చి 19: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి ప్రభుత్వం రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో మంగళవారం కొడంగల్‌లో ఆయనను కాంగ్రెస్ నాయకులు కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, నర్సిములు నాయుడు, ఉమాపతి, వీరేశం, మల్లికార్జున్, దేశ్యానాయక్, మల్లేశ్, రవినాయక్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


జ్ఞానేశ్వర్‌ను సన్మానిస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్

జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షల వెల్లువ

శంషాబాద్ రూరల్, మార్చి 19 : రాజేంద్రనగర్ నియోకవర్గానికి చెందిన బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడంతో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు మంగళవారం ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని, లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నర్కూడ ఎంపీటీసీ గౌతమీఅశోక్, ఎస్సీ సెల్ అధ్యక్షులు రాజు, రఘు. లింగమయ్య, నర్సింహ, గడ్డం మల్లేష్‌యాదవ్, మహేష్, దేవేందర్, వెంకట్‌రెడ్డి, శేఖర్, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా

● బీఆర్ఎస్ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు సతీష్‌రెడ్డి



షాబాద్, మార్చి 19 : చేవెళ్ల గడ్డ.. బీజేపీ అడ్డా అని, లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని హ్యాట్రిక్ విజయం సాధిస్తామని బీఆర్ఎస్ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడు పీసరి సతీష్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ సీఎం కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చారని, ఆ ఘనత ఆయనకే దక్కిందన్నారు. చేవెళ్ల ప్రాంతం మరింత అభివృద్ధి జరగాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌కు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి, మార్చి 19: మండల పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన లాలునాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబాన్ని మంగళవారం కాంగ్రెస్ జిల్లా నాయకుడు, శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ కాసు శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు సమకూర్చగా, స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు రాజు, శంకర్, గోపాల్, చంటి తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తజనం

కడ్తాల్, మార్చి 19: మండలంలోని అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని ఎత్తైన గుట్టపై గల శ్రీ రామేశ్వర వీరాంజనేయస్వామి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి, శివపార్వతులు, సరస్వతీదేవి ఆలయాల్లో విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. నిర్వాహకురాలు లీలా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. రెండోరోజు మంగళవారం వేడుకలకు ప్రముఖ సినీనటుడు సుమన్, పతంజలి ఆశ్రమం సాధ్వి నిర్మలనందా భారతిమాత, బటర్‌ఫ్లై సిటీ ఎండీ శేషగిరిరావు, వందేమాతరం ఫౌండేషన్ చైర్మన్ రవిందర్‌రావు, పిరమిడ్ ట్రస్టు చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా హాజరైనారు. వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయం వద్ద నిర్వహించిన హోమంలో వారు పాల్గొన్నారు. పండితులు పుణ్యహవాచనం, వాస్తు పూజ, హోమం, పారాయణం, రక్షాబంధనం, దీపారాధన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. దేవతామూర్తుల జలాదివాస పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోర్పోలు కృష్ణారెడ్డి, విజయ్ భాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తదితరులున్నారు.


కడ్తాల్ : జలాధివాసం నిర్వహిస్తున్న అర్చకులు


మాడ్గుల : ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వాన పత్రిక అందచేస్తున్న నాయకులు

ఘనంగా గరుడ వాహనసేవ

తలకొండపల్లి : మండల పరిధిలోని చుక్కాపూర్ సమీపంలోని కల్కిదొన్న గుట్టపై వెలసిన వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెల్లవారుజామున గరుడ వాహన సేవ, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ సిద్దాంతి పట్టాభిరామశర్మ, అర్చకుడు కృష్ణమూర్తి, నాయకులు శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరప్ప, మల్లన్న బోనాలు

షాబాద్ : మండల పరిధిలోని గొల్లూర్‌గూడ గ్రామంలో మంగళవారం బీరప్ప, మల్లన్న బోనాలు ఘనంగా జరిగాయి. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతల మధ్య బోనాలు, తొట్టెల ఊరేగింపును నిర్వహించారు. గ్రామస్తులంతా బీరప్ప మల్లన్న ఆలయాలకు తరలి మొక్కులు చెల్లించుకున్నారు. షాబాద్ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి పూజలు నిర్వహించి, రూ.50 వేల నగదును ఆలయ కమిటీకి అందజేశారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కడ్తాల్ : మండల పరిధిలోని రావిచేడు శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఐదురోజుల జరిగే వేడుకల్లో భాగంగా తొలిరోజు అభిషేకం, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ భారతమ్మ విఠలయ్యగౌడ్, నిర్వాహకుడు తిరుమల ఇంజమూరి రామానుజాచార్యులు, ఆదిత్య, చిదంబరం, రాంచందర్‌రావు, వెంకటేశ్ తదితరులున్నారు.

లక్ష్మీనరసింహస్వామి జాతరకు ఆహ్వానం

మాడ్గుల : మండలంలోని అప్పారెడ్డిపల్లి సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 21నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మంగళవారం జడ్పీటీసీ గౌరవరం ప్రభాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డిలు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఎమ్మెల్యేను నగరంలోని ఆయన నివాసంలో కలిశారు. పల్లేటి యాదయ్య, వెంకటయ్యగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


షాబాద్ : స్వామివారిని దర్శించుకున్న జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, తదితరులు

ఘనంగా మల్లు స్వరాజ్యం వర్ధంతి

ఇబ్రహీంపట్నం, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట నాయకురాలు, సీపీఎం నాయకురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని మంగళవారం ఇబ్రహీంపట్నంలో సీపీఎం నాయకులు నిర్వహించారు. చౌరస్తాలో ఆమె చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి జంగయ్య, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్‌లు మాట్లాడుతూ తెలంగాణలో జాగీర్దార్, రజాకార్ల అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన వనిత మల్లు స్వరాజ్యమంటూ కొనియాడారు. నాయకులు శంకర్, బుగ్గరాములు, నర్సింహ, గణేష్, యాదగిరి, షఫియున్నీసా తదితరులు పాల్గొన్నారు.

మంచాల : మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి చేద్దామని సీపీఎం మండల కార్యదర్శి శ్యాంసుందర్, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. కృష్ణమూర్తి స్మారకభవన్‌లో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యవర్గసభ్యులు సిలివేరు రాజు, లెనిన్, రజాక్‌పాష, శ్రీను, సుధాకర్, యాదయ్య, సాయిరాం, నరేష్ తదితరులున్నారు.

యాచారం : మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.భాస్కర్ అన్నారు. మండలంలోని తమ్మలోనిగూడలో ఆమె వర్ధంతి నిర్వహించారు. సీపీఎం నాయకులు, కార్యకర్తలు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీ ఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డి, సీపీఎం నాయకులు వినోద్‌కుమార్, శ్రీమన్నారాయ ణ, పి.అంజయ్య, పి. బ్రహ్మయ్య, మల్లేష్, జంగయ్య తదితరులున్నారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండటగట్టాలని, రైతుల నడ్డి విరుస్తున్న బీజేపీని కేంద్రంలో గద్దె దింపాల్సిన అవసరముందని యాచారం మండల సీపీఎం విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.భాస్కర్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మధుసూదన్‌రెడ్డిలు అన్నారు. ఈ సందర్భంగా వారు కేంద్ర ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, నాయకులు తదితరులున్నారు.


ఇబ్రహీంపట్నం : స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు : పేద ప్రజల అభ్యున్నతికి ముందుండి పోరాడిన మల్లు స్వరాజ్యంను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దుబ్బాక రాంచందర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల కమిటీ సభ్యులు ఆర్.చందు, ఎ.కుమార్, రమిణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.


కందుకూరు : నివాళులర్పిస్తున్న రాంచందర్

క్రైం కార్నర్

తాళం వేసి ఉన్న ఇంటికి కన్నం..

16 తులాల బంగారం, రూ.2 లక్షలు అపహరణ

ఆదిభట్ల, మార్చి 19 : తాళంవేసి ఉన్న ఇంట్లోకి చొరబడిన అగంతకులు 16 తులాల బంగారు నగలు, రూ.2లక్షలు దోచుకెళ్లిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరు పరిధిలోని రాఘవేంద్ర హోమ్స్‌లో నివాసముండే గంజి యాదగిరి తన భార్య ఇద్దరు కుమారులు, ఇద్దరు కోడళ్లతో కలిసి ఈనెల 16న స్వగ్రామం నల్గొండ జిల్లా పీఏపల్లిలో ఇటీవల మరణించిన బంధువు దశదిన కర్మకు వెళ్లి మంగళవారం సాయంత్రం తిరిగి వచ్చాడు. వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో వస్తువులు చిందర వందరగా ఉన్నాయి. రెండు బీరువాలు పగులగొట్టిన దుండగులు 16 తులాల బంగారు ఆభరణాలు రూ.2లక్షలు దోచుకెళ్లారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు.

గంజాయి పట్టివేత.. ఇద్దరు నిందితుల అరెస్ట్

కొత్తూర్, మార్చి 19: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ తెలిపారు. కొత్తూర్‌కు చెందిన ప్రకాష్, శంషాబాద్ రాళ్లగూడ ప్రాంతానికి చెందిన వెంకటేష్‌లు హైదరాబాద్‌లోని దూల్‌పేట్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి కొత్తూర్‌కు తీసుకొచ్చారు. కాగా, సోమవారం రాత్రి ఎస్వోటీ పోలీసులు పక్కా సమాచారంతో వారిని అదుపులోకి తీసుకొని అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. నిందితుల నుంచి 320 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయం.. వ్యక్తిపై కేసు

చేవెళ్ల, మార్చి 19 : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసిన ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శంకర్‌పల్లి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని లక్ష్మారెడ్డిగూడ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు ఫిర్యాదు రావడంతో ఇన్‌స్పెక్టర్ నాగరాజు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గౌండ్ల గోపాల్‌గౌడ్ అక్రమంగా మద్యం అమ్ముతున్న సమయంలో పోలీస్‌లు పట్టుకున్నారు. 30 క్వార్టర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో అక్రమంగా మద్యం అమ్మకూడదని, ఎవరైనా మద్యం అమ్మితే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.

పిడుగుపాటుకు జెర్సీ ఆవు మృత్యువాత

చేవెళ్ల, మార్చి 19 : పిడుగు పాటుకు జెర్సీ ఆవు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ఆలూర్‌లో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలూర్‌కు చెందిన జోగు వెంకటయ్య ఎప్పటి మాదిరిగానే సోమవారం సాయంత్రం పశువుల పాకలో జెర్సీ ఆవును కట్టేసి ఇంటికి వచ్చాడు. సోమవారం అర్ధరాత్రి పిడుగు పాటుకు ఆవు మృతిచెందింది. మంగళవారం ఉదయం రైతు వెంకటయ్యకు వెళ్లి చూడగా మృతిచెంది ఉంది. దాంతో అతడు బోరున విలపించాడు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని ఈ సందర్భంగా కోరాడు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం తగదు


ఆశా కార్యకర్తలకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో విజయలక్ష్మి

కేశంపేట, మార్చి 19: ప్రజలకు వైద్యసేవలందించడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని షాద్‌నగర్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కేంద్రం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం అములు చేస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సబ్బంది అందుబాటులో ఉండాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఉండే సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్, హెచ్‌ఈవోలు ఆంజనేయులు, ఉపేందర్‌దరెడ్డి తదితరులున్నారు.

ప్రీతమ్‌కు అభినందనలు



ఆమనగల్లు, మార్చి 19: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతమ్‌ను మంగళవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి, దళితుల సంక్షేమానికి ప్రభుత్వపరంగా తోడ్పాటునందించాలని కోరారు. వస్పుల శ్రీశైలం, కంబాలపల్లి రామకృష్ణ, పోతుగంటి అశోక్, కృష్ణ తదితరులు ఉన్నారు.

గులాబీ గూటికి శ్రీనివాస్ యాదవ్


శ్రీనివాస్ యాదవ్‌కు కండువా కప్పుతున్న కేసీఆర్

ఆమనగల్లు, మార్చి 19: బీఎస్పీ కల్వకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము శ్రీనివాస్ యాదవ్ గులాబీ గూటికి చేరారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రధాన అనుచరుడిగా కొనసాగుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా శ్రీనివాస్‌యాదవ్ పోటీ చేశారు. బీఎస్పీలో తనకు సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతానని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

షాబాద్, మార్చి 19 : పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పకుండా వేయించాలని రేగడిదోస్వాడ పశు వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవునిగడ్డ, వెంకమ్మగూడ గ్రామాల్లో పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. ఈ అవకాశాన్ని పశువులు ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కడ్తాల్, మార్చి 19: పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్స్ శబరి, సరళాదేవిలు అన్నారు. పౌష్టిక విలువలను ప్రతీ ఒక్కరు గుర్తెరుగాలని సూచించారు. మండలం పరిధిలోని ముద్విన్, రావిచెడ్, మద్దెలకుంట తండా అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్లు, తదితరులు

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లోకి వలసలు

కొత్తూర్/కేశంపేట, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలోకి వలసలుగా వస్తున్నారని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని మల్లాపూర్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మంగళవారం షాద్‌నగర్‌కు తరలివచ్చి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మల్లాపూర్ మాజీ సర్పంచ్ సాయిలు తదితరులున్నారు. అదవిధంగా కేశంపేట మండల పరిధిలోని బొదునంపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు, యువజన సంఘాల సభ్యులు వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే నివాసానికి తరలివెళ్లిన నాయకులకు స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ గ్రామ యువత అధ్యక్షుడు కోటేశ్వర్, పిప్పళ్ల కుమార్, ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షుడు ఎదిరె మహేష్, చైతన్య యూత్ అధ్యక్షుడు మల్లేష్, హనుమాన్ యూత్ అధ్యక్షుడు శివకుమార్, శ్రీరామ్ యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్, మల్లేష్, జగదీశ్వర్‌తో పాటు 90మంది పార్టీలో చేరారు.


కోదండరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

భూ సమస్యలు పరిష్కరించాలి

ఆమనగల్లు, మార్చి 19 : తమ గ్రామంలోని భూములు రిజిస్ట్రేషన్ కావడం లేదని, వెంటనే క్రయ విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సాలార్‌పూర్ గ్రామస్తులు మంగళవారం ధరణి కమిటీ సభ్యుడు ఎం.కోదండ రెడ్డిని నగరంలో కలిసి సమస్యలు వివరించారు. గ్రామంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఏళ్లకాలంగా సాగు చేసుకుంటున్న తమ భూములకు పట్టాలు ఉన్నాయని, క్రయవిక్రయాలు కూడా జరిగేవని.. ఏడాది క్రితం ఆ భూములు వక్ఫ్ బోర్డులో నమోదయ్యాయని, రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్లు నిలిపివేశారని పేర్కొన్నారు. ఏడాదిన్నర కాలంగా సాలార్‌పూర్ గ్రామంలో భూముల క్రయవిక్రయాలు జరగడం లేదా? అని ఈ సందర్భంగా కోదండరెడ్డి వాపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, నాయకులు యాదగిరిరెడ్డి, శంకర్, ప్రకాశ్ నాయక్, హరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయంతో అందరూ బాగుపడాలి

మొయినాబాద్ రూరల్, మార్చి19: వ్యవసాయంతో అన్ని వర్గాల ప్రజలు బాగుపడాలనేదే తన ధ్యేయమని చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. రైతులు వ్యవసాయం చేసుకునేందుకు గోశాల ద్వారా ఉచితంగా ఎద్దులను బహుమతిగా ఇస్తున్నట్లు చెప్పారు. మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన మహ్మద్ గౌస్ తనకు ఉన్న ఎద్దులతో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండగా ఇటీవల ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో ఓ ఎద్దు మృతి చెందడంతో రంగరాజన్ స్పందించి చిలుకూరు బాలాజీ దేవాలయం వెనుకాల గల గోశాలలో నుంచి ఒక ఎద్దును మంగళవారం ఇచ్చారు.


గౌస్‌కు ఎద్దును అందజేస్తున్న రంగరాజన్

చిలుకూరు బాలాజీ దేవాలయం వేదికగా 'పశువును బహుమతి' కార్యక్రమానికి పూనుకున్నట్లు రంగరాజన్ తెలిపారు. గతంలో చాలా మంది రైతులకు పశువులను దానం చేసినట్లు గుర్తుచేశారు. పవన్‌కుమార్‌తో పాటు ఆలయ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్తంగా..

శంషాబాద్ : నేడు(బుధవారం) శంషాబాద్‌కు చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ రానున్నారు. మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు ముఖ్య కార్యకర్తల సమావేశం జరగనుంది. ఎమ్మెల్యేలు సబితారెడ్డి, ప్రకాష్‌గౌడ్, యాదయ్య పాల్గొననున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొననున్నారు.

మొయినాబాద్ : మొయినాబాద్ మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారులో వ్యవసాయ పొలాల్లో ఎగర లేని స్థితిలో ఉన్న జాతీయ పక్షి నెమలిని గ్రామస్తులు గమనించి ఫారెస్టు అధికారులకు మంగళవారం అప్పగించారు. కేతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి పొలం వద్దకు వెళ్లాడు. పొలంలో నెమలి ఎగరలేని స్థితిలోపడి ఉంది. ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో చిలుకూరు మృగవని అటవీ శాఖ అధికారి సయ్యద్ కమాలోద్దీన్‌కు గ్రామస్తులు నెమలిని అప్పగించారు. నెమలిని కాపాడిన గ్రామస్తులను అటవి శాఖ అధికారులు అభినందించారు.

ఆమనగల్లు : సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ బటాడ్, వైస్ గవర్నర్ మహేందర్‌కుమార్ రెడ్డి, రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ దామోదర్ రెడ్డిలు అన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్, లయన్స్‌క్లబ్ హైదరాబాద్ ఎవరెస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఐనాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహించారు.

కొందుర్గు : మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో దివ్యశక్తి పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని దివ్యశక్తి పరిశ్రమ ఉపాధ్యక్షులు సునిల్ బురాన్ మంగళవారం ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కె.రాములుగౌడ్ మాట్లాడుతూ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. హెచ్ఆర్ డిప్యూటీ మేనేజర్ సతీష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంచాల : మండల కేంద్రంలో కీ.శే. అనిరెడ్డి శారదమ్మలక్ష్మారెడ్డిల జ్ఞాపకార్థం ఆయన తనయుడు అనిరెడ్డి శేఖర్‌రెడ్డి ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డా.రాంరెడ్డి తనయుడు వెంకటనర్సింహారెడ్డి మంగళవారం ప్రారంభించారు. శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రజల దప్పిక తీర్చేందుకు ప్రతీయేటా చలివేంద్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

టెన్త్ హిందీ పరీక్షకు

99.68శాతం హాజరు

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సెకండ్ లాంగ్వేజ్ (హిందీ) పరీక్షకు జిల్లాలో 50,810 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 50,652 మంది హాజరయ్యారు. 158 మంది హాజరు కాలేదు. ప్రైవేట్ విద్యార్థులు 10 మందికి ఆరుగురు హాజరయ్యారు.

'భట్టి'ని కలిసిన చల్లా


భట్టి విక్రమార్కకు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న నర్సింహారెడ్డి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్) : డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి పట్టణ మౌలిక సదుపాయాల ఆర్థిక సంస్థ చైర్మన్ పదవి దక్కిన సందర్భంగా మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను నగరంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ కప్పి జ్ఞాపిక అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని కలిశారు. డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లా కవితాబాల్‌రెడ్డి, సిద్దాల మౌనికా శ్రీశైలం, చల్లా శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, పి.శేఖర్‌రెడ్డి, మురళీగౌడ్, విజయ్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పరుశురాం తదితరులు ఉన్నారు.

'క్రైస్తవులపై కేసులు ఎత్తివేయాలి'

చేవెళ్ల, మార్చి 19 : శంకర్‌పల్లి మండలంలోని జన్వాడ గ్రామంలో జరిగిన ఇరు మతస్తుల గొడవలో భాగంగా క్రైస్తవులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెలోషిప్ రాష్ట్ర అధ్యక్షుడు టీడీఎస్ మాని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో క్రిష్టియన్ల ఆధ్వర్యంలో చేవెళ్ల ఆర్డీవో కార్యాలయంలో కేసులు ఎత్తేయాలని కోరుతూ అధికారికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జన్వాడ బాధితులకు న్యాయం చేయాలన్నారు. వారిపై ఉన్న కేసులను ఎత్తివేయాలని కోరారు. క్రిష్టియన్లకు నష్టపరిహారం చెల్లించాలని, వారిపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. బిషప్ యెసుదాస్, ప్రభుదాస్, క్రిష్టఫర్, ఎలియాజర్, పాస్టర్ సుదర్శన్, దానియల్‌రాజ్, జూషప్, పురుషోత్తం, ఇమ్మాన్యుయేల్ తదితరులు ఉన్నారు.

మత్స్య సహకార సంఘం

గ్రామ అధ్యక్షుడిగా కృష్ణ ముదిరాజ్



కందుకూరు, మార్చి 19: మండలంలోని చిప్పలపల్లి గ్రామ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా అంబటి కృష్ణ ముదిరాజ్ ఎన్నికైనట్లు ఆ సంఘం పరిశీలకుడు ఖదీర్ తెలిపారు. అధ్యక్షుడితో పాటు 8మంది డైరెక్టర్లకు మంగళవారం ఎన్నికలను నిర్వహించినట్లు చెప్పారు. ఉపాధ్యక్షుడిగా మావిళ్ల రాజు, కార్యదర్శిగా పి.సురేష్, డైరెక్టర్లుగా గోపాల్‌దాస్ జంగయ్య, అంబటి యాదగిరి, పి.రమేష్, ఎం.రవి, డి.లక్ష్మయ్య, ఎం.ప్రవీణ్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి


పుస్తకాలను చూపిస్తున్న నాయకులు

శంషాబాద్ రూరల్, మార్చి 19 : ప్రైవేట్ పాఠశాలల దోపిడీని ప్రభుత్వం అరికట్టాలని ఏబీవీపీ మండలాధ్యక్షుడు ప్రదీప్ కోరారు. మండల పరిధిలోని నర్కూడ ట్రినిటీ పాఠశాలలో మంగళవారం నోట్‌బుక్స్, యూనిఫాంను అధిక ధరలకు అమ్ముతున్నారనే సమాచారం అందడంతో ఏబీవీపీ నాయకులు వెళ్లి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధిక ధరలకు స్టేషనరీ, యూనిఫాం విక్రయిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ట్రినిటీ స్కూల్ ఒంటిపూట బడి నడపకుండా ఫుల్‌టైం నడుపుతోందని అన్నారు. జిల్లా కన్వీనర్ మహేష్, జాతీయ ఆర్‌కేఎం కోకన్వీనర్ మణికంఠ, అఖిల్, చందు, పవన్, శివ, తిరుపతి, చరణ్, దీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

షాద్‌నగర్ రూరల్, మార్చి19: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని రాయికల్ టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం తెలిపారు. సడక్ జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ హైవే ఆధ్వర్యంలో రాయికల్ ఉన్నత పాఠశాలలో రూ.9.85 లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎచ్ఎంలు జయమ్మ, కృష్ణయ్య, టోల్ ప్లాజా సిబ్బంది విశ్వనాథ్, బిజోయ్ బాబు, జగదీష్, నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


'అగస్త్య'తో ఒప్పందం నైపుణ్యాభివృద్ధికి దోహదం

● చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత


ఒప్పంద పత్రాన్ని చూపిస్తున్న ప్రిన్సిపాల్

చేవెళ్ల, మార్చి 19 : విద్యార్థుల్లో శాస్త్రీయ అవగాహన పెంచడానికి, నైపుణ్యాభివృద్ధికి అగస్త్య ఫౌండేషన్ ఎంతగానో దోహదపడుతుందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. మంగళవారం చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ పాఠశాలతో పరసర్పర అవగాహన ఒప్పందం చేసుకున్న సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విద్యార్థులను నూనత ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగస్త్యతో ఐదేళ్ల ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ నిర్వాహకులు దశరథ్, రమేశ్, శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులు వివిధ నైపుణ్యాలు నేర్చుకుంటారని చెప్పారు. అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ముగ్గురి ఎంపిక


లాటరీ తీస్తున్న అదనపు కలెక్టర్

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్), మార్చి 19 : 2024-25 విద్యా సంవత్సరానికి బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, రామంతాపూర్‌ని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ బాలబాలికల నుంచి 29 దరఖాస్తులు వచ్చాయి. అందులో ముగ్గురు పిల్లలను జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మంగళవారం కలెక్టరేట్‌లో లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ప్రవేశానికి మిథాలి రాజ్ షైళి, అలాగే ఆధ్య వల్లింపుల, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి నీతిక ఆము ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ జె. రామారావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.